నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, సంజీవయ్యపార్కు పార్కు, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్‌ట్యాంక్, ఆర్మా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీసు లేన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సార్‌నగర్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం లేన్, బీ–టైపు క్వార్టర్స్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్సార్‌నగర్ కమ్యూనిటీ హాల్ మెయిన్‌రోడ్డు, గౌతమిధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 41, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18.

ఓయూ క్యాంపస్‌లో వీసీ పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో వీసీ ప్రొ. కుమార్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. వర్సిటీలోని హెల్త్ సెంటర్, స్విమింగ్ పూల్, సీఎఫ్ఆర్డీ భవనం, ఎన్ఆర్ఎస్, ఇతర హాస్టళ్లలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు, ఉద్యోగులు, వాకర్స్ కృషి చేయాలన్నారు. వీసీతో పాటు ఇతర అధికారులు క్యాంపస్‌లో పర్యటించి వివిధ కార్యాలయాల్లో పనితీరును, సమస్యలను అడిగితెలుసుకున్నారు.

వారాసిగూడ డీఐగా పురేందర్‌రెడ్డి



సికింద్రాబాద్: వారాసిగూడ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఏ.పురేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన పురేందర్ రెడ్డి అఫ్జల్‌గంజ్, చాంద్రాయణగుట్ట, హుమాయూన్‌నగర్ పీఎస్‌లలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. వారాసీగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నిర్ణయం ఇక బ్యాంకులదే..!

రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన పూర్తి

- అర్హుల జాబితా పంపిన అధికారులు!
- మొత్తం దరఖాస్తులు 5,461
- లష్కర్‌లో అర్హులు 3,323 మంది



దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సర్కిల్ పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్ల నుంచి మొత్తం 5,461 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తమకు అందిన దరఖాస్తులను పరిశీలించిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ యూడీసీ అధికారులు 3,323 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వృత్తి విద్యాకోర్సుల సర్టిఫికెట్లు, వాస్తవ కుటుంబ పరిస్థితుల ఆధారంగా యువవికాసం పథకం ద్వారా రుణాలు పొందేందుకు అర్హులను ఎంపిక చేశారు.

లబ్ధిదారులు వీరే..

నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి ఎంపిక చేసిన 3,323 దరఖాస్తుల్లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఎంపిక చేసిన దరఖాస్తుల్లో 1,179 మంది ఎస్సీ, 101 ఎస్టీ, బీసీ 1,321, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ 112, మైనారిటీ 508, క్రిస్టియన్లకు చెందిన 102 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా నేరుగా ప్రభుత్వం నుంచి రూ.50 వేల ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉన్న పథకం కోసం తక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

బ్యాంకులకు జాబితా

ఎంపిక చేసిన దరఖాస్తుల జాబితాను రుణాలు అందించడం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయాల నుంచి వివిధ జాతీయ బ్యాంకులను పంపించారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు రుణ సహాయాన్ని అందించనున్నారు. సిబిల్ స్కోరు ఆధారంగా గనుక రుణాల ఇవ్వాలని బ్యాంకు అధికారులు నిర్ణయిస్తే మాత్రం లబ్ధిదారుల్లో సగం మంది రుణాలు పొందే అవకాశాన్ని కోల్పోనున్నారు.

సిబిల్ నిబంధనలు ఎత్తివేయాలి



పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువకులను కేవలం సామాజికాంశాల మీద మాత్రమే రాజీవ్ యువవికాసం రుణాలకు ఎంపిక చేయాలి. ఉపాధి మార్గం చూపేందుకు ఇచ్చే రుణాలకు బ్యాంకులు పాన్‌కార్డు, సిబిల్ స్కోరు వంటి నిబంధనలు పెట్టడం సరికాదు. సిబిల్ అంశం ముందుకు రావడంతో దరఖాస్తు దారుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం స్పందించి సిబిల్ నిబంధనలు త్తివేయాలి.

– కాంపెల్లి శ్రీనివాస్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన



రాజీవ్ యువవికాసం కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలన చేశాం. నిబంధనల మేరకు ధృవీకరణలు అందించిన వారందరినీ లబ్ధిదారుల జాబితాలో చేర్చాం. చిరునామాల్లో తేడాలు ఉండడం, అవసరమైన ధృవీకరణలు అందించలేని 2,138 మంది దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచాం. దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితాను తహసీల్దార్ కార్యాల ద్వారా బ్యాంకుల పరిశీలనకు పంపించాం.

–టీ.శ్రీనాథ్, యూసీడీ ప్రాజెక్టు అధికారి సికింద్రాబాద్

ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో పలువురి చేరిక



అడ్డగుట్ట: టీజీఎస్పీడీసీఎల్ సికింద్రాబాద్ సర్కిల్ ప్యారడైజ్ డివిజన్ 1104 యూనియన్‌కు చెందిన పలువురు సభ్యులు శుక్రవారం ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ టీజీఎస్పీడీసీఎల్ 327 యూనియన్‌లో చేరారు. యూనియన్ స్టేట్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ సమక్షంలో 1104 యూనియన్‌కు చెందిన 9 మంది (ఫోర్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు) సభ్యులు చేరినట్లు తెలిపారు. ఈ మేరకు వారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. యూనియన్‌లో చేరిన వారిలో ఫోర్మెన్ గుర్రం మల్లేశం, లైన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, చౌటి గోవర్ధన్, లైన్‌మెన్‌లు సురేష్, రామకృష్ణ, షేక్ జాను భాష, బాబు నాయక్, మల్లికార్జున్ రావు, సాంబశివలు ఉన్నారు.

ఉస్మానియాలో ముగ్గురికి పీహెచ్‌డీ డాక్టరేట్లు



ఎండీ నిస్సార్ హుస్సేన్



డా. సాయి సుధీర్‌రెడ్డి



డా.కొర్వి బాల కృష్ణ ముదిరాజ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీల్లో వివిధ అంశాల్లో పరిశోధనలు చేసిన ముగ్గురికి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఎండీ నిస్సార్ హుస్సేన్‌కు ఎకనమిక్స్‌లో, క్లోం సాయి సుధీర్‌రెడ్డికి కామర్స్‌లో, ఓయూ ఇంగ్లిష్ విభాగం విద్యార్థి కొర్వి బాలకృష్ణ ముదిరాజ్‌కు సాఫ్ట్ స్కిల్స్ విభాగంలో పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్ లభించింది.

రాజిరెడ్డికి మాజీ మేయర్ నివాళి

లాలాపేట: అనారోగ్యంతో మృతి చెందిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పార్థివ దేహం వద్ద శుక్రవారం మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి నివాళులర్పించారు. ఆయన సోదరుడు ప్రస్తుత ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, సంపత్, రాజేష్ తదితరులున్నారు.



ఈ సారైన ఓయూ స్నాతకోత్సవం జరిగేనా..?



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ స్నాతకోత్సవం గత ఏడాది జరగలేదు...ఈ సారైన జరిగేనా...? అని విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలకు స్నాతకోత్సవాల నిర్వహణ కీలకం...స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథుల నుంచి డిగ్రీ పట్టాలను, బంగారు పతకాలను అందుకోవడం ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. కానీ ఓయూ స్నాతకోత్సవాలు ప్రతి సంవత్సరం జరగడం లేదు. గత వీసీ ప్రొ.రవిందర్ వరుసగా స్నాతకోత్సవాలను నిర్వహించి వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి గౌరవ డాక్టరేట్లను కూడ ప్రదానం చేశారు. అయితే గత ఏడాది నుంచి స్నాతకోత్సవాల నిర్వహణ మళ్లీ పడకవేసింది. ప్రస్తుత వీసీ ప్రొ.కుమార్ గత ఏడాది స్నాతకోత్సవాన్ని నిర్వహించలేదు. ఈ సారైనా నిర్వహించాలని పీహెచ్‌డీ డాక్టరేట్లు, గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు కోరుకుంటున్నారు.

సుందర్‌నగర్‌లో ప్యాచ్‌వర్క్ పనులు ప్రారంభం



సనత్‌నగర్: సుందర్‌నగర్‌లో ఇటీవల స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తయినా రోడ్డు నిర్మాణం గానీ, ప్యాచ్ వర్క్‌లు గానీ చేపట్టకపోవడంతో గుంతలమయమైన రహదారిపై రాకపోకలు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించాయి. ఈ విషయాన్ని సుందర్‌నగర్ అధ్యక్షుడు కంజర్ల అమర్నాథ్ స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం గుంతలమయంగా మారిన రహదారిపై ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. బీఆర్ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కంజర్ల అమర్నాథ్ పనులను పర్యవేక్షించారు. మాచారావు, రమేష్, సురేష్‌గౌడ్, సూపర్‌వైజర్ భాస్కర్ పాల్గొన్నారు.

పవర్ బోర్లకు మరమ్మతులు



అడ్డగుట్ట: ప్రజల సౌకర్యార్థం డివిజన్‌లోని పలు బస్తీల్లో పాడైపోయిన పవర్ బోర్లకు మరమ్మతులు చేస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అడ్డగుట్టలోని ఏ, డీ సెక్షన్లలో పాడైపోయిన పవర్‌బోర్లకు జలమండలి ఎలక్ట్రికల్ సిబ్బంది మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్, చందర్‌గౌడ్, రామప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

12న అన్నమయ్య జయంతి

నల్లకుంట: శ్రీసరస్వతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 12న పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అధ్యాపకురాలు మల్లాది యశస్విని శుక్రవారం తెలిపారు. నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సంగీత విద్యాలయంలో సాయంత్రం సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగానరత్న పోపూరి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో అన్నమయ్యకు సంకీర్తనార్చన ఉంటుందన్నారు.

ప్రత్యేక పూజలు





అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో తెలంగాణ దేవాదయ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పూజలు చేశారు. చండీ హోమం నిర్వహించి గర్భగుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.కృష్ణ తెలిపారు

ఆలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

రసూల్‌పురా: ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా సహకరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీచ్చారు. రసూల్‌పురా శివానగర్‌లోని కాశీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రహరీ, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డితో కలిసి ఆలయంలో పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గడప రాములు, ఉపాధ్యక్షులు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి అయిలయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోండి



అమీర్‌పేట: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న దేవాలయాలు, చర్చీలు, మసీదు కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయాలు, చర్చిలు, మసీదులు, గురుద్వారాల వద్ద సీసీకెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. వదంతులు నమ్మరాదని స్పష్టం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్, కమిటీల సభ్యులు సుధీర్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

సంస్కృత అకాడమికి సహకారమందిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: సంస్కృత అకాడమికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించనున్నట్లు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం రాజ్ భవన్‌లో గవర్నర్ అధ్యక్షత ఓయూ సంస్కృత అకాడమి 46వ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. అకాడమిలో జరుగుతున్న కార్యక్రమాల వివరాలను ఓయూ వీసీ ప్రొ.కుమార్ రాష్ట్ర గవర్నర్‌కు వివరించగా అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓయూలో బీఆర్ఎస్ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఓయూలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత వీఆర్ఓ, వీఆర్ఏ గ్రామ పాలన అధికారులుగా (జీపీవో) నియమించడం వలన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని.. డిగ్రీ అర్హతతో జీపీవో ఉద్యోగాలను డైరెక్టుగా నియమించాలని, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల కోసం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమేష్‌గౌడ్, మధు, సైదులు, వెంకటేష్, మల్లేశం, వీరేశలింగం పాల్గొన్నారు.

బైక్‌పై కుక్కను వెంబడిస్తూ వచ్చి ఢీకొట్టారు

సనత్‌నగర్: బైక్‌పై కుక్కను వెంబడిస్తూ వచ్చిన ముగ్గురు యువకులు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. లోతుకుంట వెంకటాపురం ప్రాంతానికి చెందిన మారి అనిత (35) ఆశావర్కర్‌గా పనిచేస్తుంది. తన బంధువు సునీల్‌తో కలిసి ఈనెల 6న సాయంత్రం జేబీఎస్ వైపు నుంచి ప్యారడైజ్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతోంది. అదే సమయంలో పరేడ్‌గ్రౌండ్ తూర్పు గేటు దగ్గరకు రాగానే వెనుక నుంచి కుక్కను వెంబడిస్తూ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వచ్చి వారిని ఢీకొట్టారు. ఈ ఘటనలో కిందపడిపోయిన అనిత తీవ్ర గాయాలకు గురయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సనత్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో చలనం లేకుండా పడి ఉన్నాడని ఈ నెల 5న ఉదయం 11 గంటలకు సనత్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మృతుడి సంబంధీకులు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

యువకుడు అదృశ్యం



జాంగీర్

సికింద్రాబాద్: ఉపాధి కోసం రాజస్థాన్ నుంచి నగరానికి వచ్చిన ఒక యువకుడు అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఎస్ఐ ఎంఏ మాజిద్ తెలిపిన మేరకు..రాజస్థాన్ రాష్ట్రం దానా గ్రామానికి చెందిన సుభం జాంగీర్ (28) నాలుగు నెలల క్రితం భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. హయత్‌నగర్ బస్‌డిపో సమీపంలో నివాసం ఉంటున్న సుభం జాంగీర్ కార్పెంటర్‌గా పనిచేసుకుంటున్నాడు. ఏప్రిల్ 27న తాను జనరల్ టికెట్ తీసుకున్నానని చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి రాజస్థాన్ వస్తున్నట్టు చెప్పాడు. రోజులు గడుస్తున్నా సుభం జాంగీర్ సొంత గ్రామం చేరలేదు. జాంగీర్ బామ్మర్ది సునిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు భూముల్లో ఆగని ఆక్రమణలు

హైడ్రా అధికారులు దృష్టిసారించాలంటున్న తార్నాక వాసులు



తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో వెలసిన అక్రమ షెడ్లు, పక్కన మట్టి వ్యర్థాలు

లాలాపేట: లాలాగూడలోని తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. కబ్జా దారులు గుట్టుచప్పుడు కాకుండా మట్టి వ్యర్థాలతో చెరువును పూడ్చుతున్నారు. ఒక వైపు చెరువు భూముల వివాదం కోర్టులో ఉన్నది. యధాస్థితి కొనసాగించాలని అధికారులు చెబుతున్నా కొందరు ఖాతరు చేయకుండా చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి తన ప్లాట్ అంటూ దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ అక్రమణలను అడ్డుకుని తొలగించారు. చెరువు భూముల్లో గతంలో కొందరు వ్యక్తులు నిబంధలనకు విరుద్ధంగా షెడ్ల నిర్మాణం, గదుల నిర్మాణం, దాని చుట్టు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు వచ్చి పాక్షికంగా కూల్చి యథావిధిగా ఉంచాలని సదరు అక్రమణ దారుణిచే రాతపూర్వకంగా హామీ తీసుకున్నారు. అయితే ఇపుడు తాజాగా అదే భూమిలో గతంలో కూల్చివేసిన షెడ్ల స్థానంలో నూతనంగా షెడ్ నిర్మాణం చేయడంతో పాటు చెరువు భూముల్లో భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తూ చెరువు మధ్యలోంచి నుంచి రోడ్డుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని తార్నాక వాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెరువు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.చెరువు భూమిలో రోడ్డు నిర్మాణానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, చెరువును అభివృద్ధి చేయాలని హైడ్రా అధికారులను కోరారు.

పార్క్ చేసిన ద్విచక్రవాహనం చోరీ

సనత్‌నగర్: పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ జెక్‌కాలనీ రోడ్ నెంబర్–4లోని క్లాసిక్ ఎవెన్యూకు చెందిన మహేష్ అంబాదాస్ పూరి ఈ నెల 2న రాత్రి 7 గంటల సమయంలో తన హోండా యాక్టివా బైక్‌పై స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. అక్కడ బైక్ పార్కు చేసి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి నగదు దోచుకెళ్లాడు

వెంగళరావునగర్: తండ్రికి సేవలు అందించడానికి వచ్చిన యువకుడు నగదు దోచుకెళ్లాడని ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వెంగళరావునగర్‌లో నివసించే పి.హిమబిందు రెండు నెలల కిందట తన తండ్రికి సేవలు అందించేందుకు కార్తికేయ అంజన్న హోం సర్వీసెస్ సెంటర్‌కు కాల్ చేసింది. ఆ సంస్థకు చెందిన వారు నెలకు రూ.22 జీతం ఇస్తున్నట్లు అగ్రిమెంట్ రాసుకుని రవి అనే యువకుడిని పంపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం రవి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెళ్లే సమయంలో హిమబిందు ఫోన్ తీసుకుని దానికి బదులు మరో ఫోన్ ఉంచి వెళ్లాడు. ఆమె అతడికి తన తల్లి ఫోన్ ద్వారా మాట్లాడగా 10 నిముషాల్లో వస్తున్నానని చెప్పి రాలేదు. అంతేగాకుండా దొంగిలించిన ఆమె ఫోన్ ద్వారా రవి రూ.63,326 నగదు కాజేశాడు. దాంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటినుంచి బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2025–28 మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ గ్రూప్‌లలో చేరేందుకు ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు మొదటి విడత వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. ఈ నెల 23న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 3వ తేదీలోపు కాలేజీలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు ఈ కాలేజీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.